జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 64 16-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06









## మతతత్వ శక్తుల మాటల మాయలో పడొద్దు

- తెలంగాణలో గంగాజమునా తెహజీబ్ వర్ధిల్లుతోంది
- సంక్షేమ పథకాల్లో మైనారిటీలకు సింహభాగం.. వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ గడ్డపై గంగాజమునా తెహజీబ్ వర్ధిల్లుతోందని, అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి ఉండటమే రాష్ట్ర అభివృద్ధికి అసలైన ఇంధనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో మతపరమైన విభజనలకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ మత సామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడ అశాంతి నెలకొన్నా, మన రాష్ట్రంలో మాత్రం మత సామరస్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన రంజాన్ ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

- మిగతా 2వ పేజీలో

# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం



- 15 మంది మృతి
- ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయెల్
- అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు
- మరో మూడు వారాలు యుద్ధం: ఇజ్రాయెల్

దుబాయ్/టెహ్రాన్: పశ్చిమాసియా రగులుతూనే ఉంది. ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ యుద్ధం ఆదివారం 16వ రోజుకు చేరింది. ఇరాన్‌లోని పారిశ్రామిక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా సైన్యం బాంబుల వర్షం కురిపించింది. ఈ ఘటనలో 15 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. వాయవ్య ఇరాన్‌లో ఇజ్రాయెల్‌కు సహకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లో దాడులకు దిగింది. పశ్చిమాసియాలోని అమెరికా పరిశ్రమలను బయటకు తరలించాలని హెచ్చరించింది.

- మిగతా 2వ పేజీలో

## ఐదు రాష్ట్రాల్లో మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా

- కీలకమైన పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతల్లో..
- తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో ఒకే విడతలో.. అన్నిచోట్లా మే 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం




2లో

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు... ముగ్గురు నిందితులకు రిమాండ్

- పైలట్ సోదరుడు రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మకు కూడా.. కాల్పులు జరిపిన కేసులో ఈ ముగ్గురికీ రిమాండ్?
- ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌కు పాజిటివ్.. రక్త పరీక్షల్లో నిర్ధారణ అయిందన్న పోలీసులు
- మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని వెల్లడి.. ఎంపీ సహా ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్

2లో

## హమాలీ కార్మికులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్..

- హమాలీ సంఘ భవనాల కోసం భూమి కేటాయింపు..
- సంక్షేమ బోర్డు ఏర్పాటు పై సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తామన్న మంత్రి సీతక్క..



తెలంగాణ సమాజ నిర్మాణంలో తమ రక్తాన్ని చెమటగా మార్చి కష్టపడే హమాలీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## దేశ రాజకీయ ముఖచిత్రం మార్చిన దీక్ష

- దేశ విముక్తికి, దళిత ఆత్మగౌరవ స్ఫూర్తికి
- జీవితాంతం అంకితమైన ధన్య జీవితం
- స్వాతంత్ర్య సమరంలో పలుమార్లు జైలుకు
- భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు
- నాటి దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం
- నేడు రాజధానిలో ఆవిష్కరించనున్న సీఎం



నెల్లూరు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతిలో రాజధాని అమరావతిలో నిర్మించిన 58 అడుగుల విగ్రహాన్ని సీఎం చంద్రబాబు సోమవారం ఆవిష్కరించనున్నారు. ఒకరోజు తిండి తినకపోతేనే కడుపులో ఏదోలా ఉంటుంది. అటువంటిది ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 58 రోజులపాటు నిరాహార దీక్ష చేయడమంటే ఊహించగలమా? అందువల్లే సరిగ్గా అన్నే అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పొట్టి శ్రీరాములు 125వ జయంతి నాడు (సోమవారం) ఆవిష్కరించనుంది. పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16వ తేదీన మద్రాసులో (ప్రస్తుతం



2లో

## 80 సీట్లు.. ఉపముఖ్యమంత్రి పదవి!

- తమిళనాట హీరో విజయ్‌కు బీజేపీ ఆఫర్?
- అదేమీ లేదంటున్న టీవీకే వర్గాలు
- అన్నాడీఎంకే నేత పళనిసామిదీ అదే మాట

చెన్నై, మార్చి 15: అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళనాడు రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఎన్‌డీఏతో పొత్తు లేనేలేదని సినీ హీరో, టీవీకే అధినేత విజయ్ పదే పదే చెబుతున్నప్పటికీ.. బీజేపీ, టీవీకే మధ్య చర్చలు సాగుతున్నాయని.. అవి తుది అంకానికి చేరుకున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మొత్తం రాష్ట్ర అసెంబ్లీ స్థానాల సంఖ్య 234 కాగా.. టీవీకేకు 80 ఇస్తామని.. విజయ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తామని బీజేపీ ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఆయన సీఎం పదవి కోరుతున్నారని,

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం..

- ప్రజాప్రతినిధులంతా ముందుకు రావాలి
- డ్రగ్స్ టెస్టుకు సిద్ధమని కేటీఆర్ స్పష్టం
- ప్రజాప్రతినిధులందరూ పరీక్షలు చేయించుకోవాలన్న పిలుపు
- డ్రగ్స్ వినియోగాన్ని తీవ్రంగా ఖండించిన కేటీఆర్
- ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే నోటీసుల హెచ్చరిక



# 80 సీట్లు.. ఉపముఖ్యమంత్రి పదవి!

చర్చల్లో ఇదే కీలకంగా మారినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలక డీఎంకే నేతృత్వంలోని కూటమికి, అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీఏకి మధ్య గట్టి పోటీ ఉందని.. ఓట్ల శాతంలో కాస్త తేడా వచ్చినా ఎన్నికల ఫలితాలు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. విజయ్‌తో పొత్తుకు తెరవెనుక వివిధ మార్గాల్లో పనిచేస్తోందని అంటున్నాయి. ఈ వార్తలు విజయ్‌కు అత్యంత సన్నిహితులు, సలహాదారులుగా ఉన్నవారికి కూడా మింగుడుపడడం లేదు. ఇది కొత్త పార్టీ విశ్వసనీయతపై ప్రభావం చూపుతుందని వారు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. స్వీయ ఇమేజ్‌తో రాజకీయ ప్రవేశం చేసిన విజయ్.. తమిళనాడు రాజకీయాల్లో తన పార్టీని ప్రత్యామ్నాయ శక్తిగా చూపిస్తున్నారని.. ఈ పరిస్థితుల్లో మరీ ఇంత త్వరగా ఎన్డీఏలో చేరితే.. ప్రతికూలత ఎదురుకావచ్చని వారు అంటున్నట్లు సమాచారం. మరోవైపు, విజయ్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని మాజీ సీఎం, అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిసామి మరోసారి స్పష్టంచేశారు.

# హమాలీలకు హెల్త్ కార్డ్, ఇన్సూరెన్స్..

హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ఈ సభలో మంత్రి ప్రధానంగా హమాలీ కార్మికుల ఆరోగ్య భద్రతపై దృష్టి సారించారు. నిరంతరం శారీరక శ్రమతో కూడిన పని చేసే హమాలీలకు మెరుగైన వైద్యం అందేలా 'హెల్త్ కార్డులు' మంజూరు చేసే అంశాన్ని.. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఐఈ హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ , ప్రత్యేక 'సంక్షేమ బోర్డు' ఏర్పాటుపై స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. గ్రామాల్లో, మండల కేంద్రాల్లో పనిచేసే హమాలీలకు కనీసం కూర్చునేందుకు కూడా సరైన స్థలం లేకపోవడంపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో హమాలీ సంఘాల భవనాల కోసం భూమిని కేటాయించే దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. హమాలీల సంక్షేమం కోసం తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల (జణఖీ) నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి కార్మికుల్లో ఉత్సాహం నింపారు. ఈ సమస్యలను అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఐదు రాష్ట్రాల్లో మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా

న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. కీలకమైన పశ్చిమ బెంగాల్‌తో పాటు తమిళనాడు, కేరళ, అస్సాం, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి శాసనసభల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం షెడ్యూల్ విడుదల చేసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీతో కలిసి ఢిల్లీలో మీడియాకు వివరాలు వెల్లడించారు. బెంగాల్‌లో 294 స్థానాలకు ఏప్రిల్ 23, 29ల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగుతుంది. కేరళ (140), అస్సాం (126), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న ఒకే దశలో పోలింగ్ నిర్వహించనున్నట్లు జ్ఞానేశ్ తెలిపారు. అన్నిచోట్లా మే 4న ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు వెల్లడిస్తామని వివరించారు. ఇప్పటికే పార్టీల నేతలు, రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశమై సలహాలు స్వీకరించామని ఆయన చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఆయా రాష్ట్రాల్లో ప్రవర్తన నియామావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మొత్తం 824 అసెంబ్లీ స్థానాలు, 17.4 కోట్ల మంది ఓటర్లున్నట్టు సీఈసీ తెలిపారు. "మొత్తం 2.19 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో పోలింగ్ కేంద్రంలో సగటున 750 నుంచి 900 మంది ఓటర్లున్నారు. సుమారు 25 లక్షల సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం" అని తెలియజేశారు. యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. హింస, ప్రలోభాలకు తావు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడాలని, గత ఎన్నికల్లో హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఈసీ పదవి నుంచి తనను తొలగించడానికి పార్లమెంటులో ప్రతిపక్షాలు నోటీసివ్వడంపై స్పందించేందుకు నిరాకరించారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు... ముగ్గురు నిందితులకు రిమాండ్

మొయినాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి కటకటాల్లోకి వెళ్లారు. రోహిత్‌రెడ్డితోపాటు డ్రగ్స్ పార్టీలో పాల్గొని నిర్ధారణ పరీక్షలో పాజిటివ్‌గా తేలిన ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మకు కూడా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఈ ముగ్గురిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. డ్రగ్స్ పార్టీలో మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకోగా.. వారిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. వీరిలో ఏపీలోని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మహేశ్‌కుమార్‌తోపాటు మిగిలిన నిందితులందరికీ పోలీసులు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించివేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌పై శనివారం రాత్రి ఈగల్ టీం, ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు కలిసి దాడులు నిర్వహించడం, ఈ సందర్భంగా కాల్పులు కూడా చోటుచేసుకోవడం తెలిసిందే.

# ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)



అమెరికా సంస్థల భాగస్వామ్యం ఉన్న కంపెనీలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఇరాన్‌లో సైనికేతర పరిశ్రమలపై జరిగిన దాడుల్లో సాధారణ పౌరులు మృతి చెందారు. ఇందుకు ప్రతీకారం తప్పదని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. అమెరికా కంపెనీలను ధ్వంసం చేస్తామని వెల్లడించింది. ఇరాన్ సుప్రీం కమాండర్ మొజ్తబా ఖమేనీ క్షేమంగా ఉన్నారని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. అమెరికా సైన్యం పశ్చిమాసియాలో క్రూయిజ్ మిస్సైళ్లు ప్రయోగిస్తోందని, వాటిని ధ్వంసం చేస్తామని అన్నారు. హార్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఐఆర్‌జీసీ నేవీ కమాండర్ అలీరెజా ప్రకటించారు. అందులో కొన్ని కీలక మార్గాలను మాత్రమే తమ నియంత్రణలోకి తీసుకున్నామని తెలిపారు. ఇరాన్‌పై యుద్ధాన్ని కనీసం మరో మూడు వారాల పాటు కొనసాగించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం స్పష్టం చేసింది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్‌లో 10,000 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 1,400 మందికిపైగా మరణించారు. ఇజ్రాయెల్ దాడిలో తమ సీనియర్ మిలటరీ అధికారి బ్రిగేడియర్ జనరల్ అబ్దుల్లా జలాలీ నసబ్ మృతి చెందినట్లు ఇరాన్ తెలిపింది. మరోవైపు గల్ఫ్‌లో ఇరాన్ దాడుల పరంపరం ఆగడం లేదు. రియాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంపై ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను తుత్తునియలు చేశామని సౌదీ అరేబియా రక్షణ శాఖ వెల్లడించింది. అల్‌ఖర్గ్‌పై ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ మిస్సైళ్లను, తూర్పు ప్రావిన్స్‌లో రెండు డ్రోన్లను మధ్యలోనే అడ్డుకున్నట్లు ప్రకటించింది. యూఏఈలోని అమెరికా అల్‌డాఫ్రా ఎయిర్‌బేస్‌పై ఐఆర్‌జీసీ 10 క్షిపణులు ప్రయోగించింది. బహ్రెయిన్‌లో సైరన్ల మోత వినిపించింది. దాడులపై తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు బహ్రెయిన్‌లో ఆరుగురు, యూఏఈలో 33 మంది అరెస్టయ్యారు. వారిలో పలువురు భారతీయులున్నారు. ఇరాన్ దాడుల్లో గాయపడిన 108 మందిని ఆసుపత్రికి తరలించినట్లు ఇజ్రాయెల్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇరాన్ సైన్యంతో పాటు లెబనాన్ భూభాగం నుంచి హెజ్‌బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగించారు. రాకెట్ల శిథిలాలు తాకడంతో టెల్ అవీవ్, హోలోన్ సిటీలో మంటలు చెలరేగాయి. కొన్ని రాకెట్లను ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ ధ్వంసం చేసింది. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో ఓ అపార్టుమెంట్ భవనం ధ్వంసమైంది. ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఇజ్రాయెల్ వద్ద బాలిస్టిక్ మిస్సైల్ ఇంటర్‌సెప్టర్ల కొరత నెలకొంది. యుద్ధం మరింత ముదిరితే ఇరాన్, హెజ్‌బొల్లా దాడులను తిప్పికొట్టడం కష్టమన్న వాదన వినిపిస్తోంది. యుద్ధాన్ని ముగించే విషయంలో తమతో ఒప్పందం చేసుకోవడానికి ఇరాన్ ఆసక్తి చూపుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. కానీ, అందుకు తాము సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. ఒప్పందానికి సంబంధించిన నిబంధనలు సమంజసంగా లేవని అభిప్రాయపడ్డారు. ఆయన తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు.

# మతతత్వ శక్తుల మాటల మాయలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీల సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాజకీయంగా, పరిపాలనలో పెద్దపీట వేస్తున్నామని సీఎం చెప్పారు. ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడిన మహమ్మద్ అజహరుద్దీన్‌ను మైనారిటీ శాఖ మంత్రిగా నియమించుకున్నామని, అదనంగా 8 మంది మైనారిటీ నేతలకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లుగా అవకాశం కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నేత షబ్బీర్ అలీ సేవలను గుర్తిస్తూ ఆయనను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించుకున్నామని తెలిపారు. ఆ 4 శాతం రిజర్వేషన్ల వల్లే వేలాది మంది ముస్లిం యువకులు డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని గుర్తు చేశారు. ప్రపంచ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటిన క్రికెటర్ సిరాజ్, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌లను డీఎస్పీలుగా నియమించడమే కాకుండా, వారికి భారీగా ఆర్థిక సాయం అందించి అండగా నిలిచామని పేర్కొన్నారు.

**సేవా భావానికి ప్రతీక రంజాన్**

రంజాన్ కేవలం పండుగ మాత్రమే కాదు.. అది క్రమశిక్షణ, ఆత్మశుద్ధి మానవతా విలువలను గుర్తు చేసే పవిత్ర మాసం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక నెల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ, తోటి వారికి సహాయం చేయడమే ఈ మాసం ఇచ్చే గొప్ప సందేశం అని కొనియాడారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకంలో మైనారిటీలకు సింహభాగం దక్కేలా చూస్తున్నామని, తెలంగాణ అభివద్ధిలో మీరంతా భాగస్వాములు కావాలని, మీ దువా (ప్రార్థనలు) రాష్ట్రానికి రక్షణ కవచంలా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అజహరుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, రాజ్యసభ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వేలాది మంది మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర రాజకీయాల్లో డ్రగ్స్ అంశం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసు నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన విమర్శలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీటుగా స్పందించారు. తనపై వస్తున్న అనుమానాలను పటాపంచలు చేసేందుకు ఎలాంటి పరీక్షలకైనా తాను సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. మొయినాబాద్ డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్ బృందం సమాధానం చెప్పాలని, ఆయనకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలంటూ మహేశ్ గౌడ్ చేసిన సూచనను కేటీఆర్ స్వాగతించారు. "నేను ఏ క్షణమైనా, ఏ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని గతంలోనే పలుమార్లు స్పష్టం చేశాను. ఇప్పుడు కూడా అదే మాట మీద ఉన్నాను" అని కేటీఆర్ పునరుద్ఘాటించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి డ్రగ్స్ వాడటం అత్యంత దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం తాను మాత్రమే కాకుండా, రాజకీయాల్లో ఉన్న ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "మనం పరీక్షలు చేయించుకుని సమాజానికి ఆదర్శంగా ఉందాం. డ్రగ్స్ వాడకాన్ని, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. డ్రగ్స్ వినియోగించే వారు ఎంతటి వారైనా సరే.. వారిని కఠినంగా శిక్షించాల్సిందే" అని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో తన పేరును డ్రగ్స్ కేసులోకి లాగాలని చూస్తే ఊరుకోబోనని కేటీఆర్ హెచ్చరించారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేస్తే చట్టపరంగా నోటీసులు జారీ చేస్తానని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తాను డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానని, యువతను పాడు చేస్తున్న ఈ సంస్కృతిని నిర్మూలించడంలో రాజీ పడబోమని ఆయన పేర్కొన్నారు.

# దేశ రాజకీయ ముఖచిత్రం మార్చిన దీక్ష

చెన్నై) గురవయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. నెల్లూరుకు చెందిన వీరి తల్లిదండ్రులు వ్యాపార అవసరాల రీత్యా మద్రాసుకు వలస వెళ్లారు.

ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం మద్రాసులోనే జరిగింది. ఆ తర్వాత బొంబాయి వెళ్లి శానిటరీ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఈ సమయంలోనే శ్రీరాములుకు తన మేనమామ కుమార్తె సుబ్బమ్మతో వివాహం జరిగింది. కొన్నాళ్లు మద్రాసులో చిన్నపాటి ఉద్యోగం చేశాక తిరిగి బొంబాయి వెళ్లి చదువుకు తగ్గ ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలోనే భార్య సుబ్బమ్మ అనారోగ్యం పాలయ్యారు. అనేక మంది వైద్యుల వద్ద చూపించినా చివరకు సుబ్బమ్మ 1928లో తనువు చాలించారు. అంతకుముందే పుట్టిన బిడ్డ కూడా చనిపోవడంతో శ్రీరాములు కుంగిపోయారు. అక్కడి నుంచి పూర్తిగా దేశ సేవలోకి దిగారు. బొంబాయిలో కాలేజీలో చదువుతూనే జాతీయోద్యమం వైపు శ్రీరాములు ఆకర్షితులయ్యారు. అయితే, సన్నిహితుల సూచన మేరకు ముందు చదువును పూర్తి చేశారు. అయితే 1930వ సంవత్సరం శ్రీరాములు జీవితాన్ని మలుపుతిప్పింది. గాంధీని కలిసిన శ్రీరాములు.. తన మిగిలిన జీవితాన్ని దేశ సేవకై అంకితం చేసేందుకు అవకాశమివ్వాలని కోరారు. దీంతో సబర్మతి ఆశ్రమంలో చేరాల్సిందిగా గాంధీజీ సూచించారు. అప్పుడు కూడా స్నేహితులు, బంధువులు ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి వెళ్లవద్దని సూచించినా శ్రీరాములు పట్టించుకోలేదు. సబర్మతి ఆశ్రమంలో ఉంటూ గాంధీజీ ఆలోచనలకు, ఆశయాలకు ఆకర్షితుడయ్యారు. 1933లో గాంధీ బ్రిటీషు అధికారుల తీరుకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమం చేపట్టారు. ఆ సమయంలోనే గాంధీతో పాటు సబర్మతి ఆశ్రమంలో ఉన్న 34 మందిని బ్రిటీషు పోలీసులు అరెస్టు చేశారు. ఇలా తొలిసారి స్వాతంత్ర్య ఉద్యమంలో అరెస్టయి శ్రీరాములు జైలుకు వెళ్లారు. ఆ తర్వాత ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు మరోమారు జైలు జీవితం గడిపారు. 1934లో బీహార్‌లో పెద్ద భూకంపం సంభవించింది. అక్కడి బాధితులకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా గాంధీజీ పిలుపునిచ్చారు. ఈ సమయంలో బీహార్ భూకంప బాధితుల కేంద్ర సహాయక సంఘం ఏర్పడింది. ఈ సంఘంలో శ్రీరాములు సభ్యునిగా ఉన్నారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె గ్రామంలో వైద్యునిగా పనిచేస్తున్న సోదరుడు రంగయ్య నుంచి శ్రీరాములుకు ఓ ఉత్తరం అందింది. మేనమామ అవసాన దశలో ఉన్నట్లు తెలపడంతో శ్రీరాములు అక్కడికి చేరుకున్నారు. స్థానికంగా బడుగు, బలహీన వర్గాలకు ఎదుర్కొంటున్న దురాచారాలను నిలదీశారు. అప్పట్లో రెండు రోజులు మద్య నిషేధం కోసం నిరాహార దీక్ష చేశారు. మరోసారి మద్యం ముట్టుకోము అని ఆ ఊరి వారితో ప్రమాణం చేయిస్తూ గ్రామంలో ఓ పాడుపడిపోయిన ఓ బావికి వారి చేత మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను తీర్చారు. అనంతరం కృష్ణా జిల్లా అంగలూరులో స్థాపించిన గాంధీ ఆశ్రమానికి శ్రీరాములు చేరుకొని నూలు వడకడం, మద్యనిషేధం, అస్పృశ్యతా నివారణ మొదలైన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వరాజ్యం కోసం పోరాడుతున్న గాంధీని అరెస్టు చేశారన్న వార్త తెలుసుకున్న శ్రీరాములు.. 1943లో గుడివాడ వెళ్లి జాతీయ జెండాను ధరించి బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. దీంతో మరోమారు శ్రీరాములు జైలుకెళ్లారు. జైలు నుంచి విడుదలయ్యాక తిరిగి జువ్వలదిన్నె చేరుకుని, ప్రజలను చైతన్యం చేశారు.



# రామన్న పేట సర్కారు దవాఖాన..

# సమస్యల బందీఖాన

- 50 ఏళ్ల చరిత్ర ఉన్న ఆసుపత్రి శిథిలావస్థలో
- రోజుకు 400 మంది రోగులుఉ సరిపడా డాక్టర్లు లేని పరిస్థితి
- 22 పోస్టులు మంజూరుఉ పనిచేస్తున్నది కేవలం 8 మంది వైద్యులు
- తగ్గిన ప్రసవాలుఉ ప్రైవేటు ఆసుపత్రులపై పెరిగిన ఆధారపడటం
- తాగునీరు, పారిశుధ్యం లేక రోగులకు ఇబ్బందులు
- నిరుపయోగంగా మారిన బ్లడ్ బ్యాంక్ భవనం, యోగ షెడ్
- శిథిలావస్థలో మరుగుదొడ్లుఉ రోగులు, సిబ్బందికి కష్టాలు
- వర్షం పడితే చెరువును తలపించే ఆసుపత్రి ప్రాంగణం
- 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ప్రజల డిమాండ్
- సమస్యల పరిష్కారం కోసం నేడు సిపిఎం నిరవధిక నిరాహార దీక్షలు






**రామన్నపేట ప్రభుత్వాసుపత్రి దుర్భర పరిస్థితుల్లో కొనసాగుతూ సమస్యల బంధీఖానగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిని ప్రతిబింబించిన "నేను రాను బిడ్డ మన ఊరి దవాఖానకు" అనే పాట నేటికీ ప్రస్తుత పరిస్థితికి సరిగ్గా సరిపోతుందని స్థానికులు చెబుతున్నారు. 1970లో ప్రారంభమైన రామన్నపేట ప్రభుత్వాసుపత్రి గత ఐదు దశాబ్దాలుగా పాత నియోజకవర్గ కేంద్రంగా ఏడు మండలాలకు చెందిన అనేక గ్రామాలకు వైద్య సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషించింది. అయితే ప్రస్తుతం ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం, సరిపడా డాక్టర్లు లేకపోవడం వల్ల పేదలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారింది.**

**రామన్నపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** గతంలో ఈ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా మార్చుతామని బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ అది కూడా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఆసుపత్రి 50 పడకలకే పరిమితమై అభివృద్ధి లేకుండా కొనసాగుతోంది. రోజుకు సగటున 400 మంది అవుట్‌పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ సరిపడా డాక్టర్లు, ఆధునిక వైద్య పరికరాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థిక భారం మోస్తున్నారు. ఆసుపత్రికి 22 డాక్టర్ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం కేవలం నలుగురు రెగ్యులర్ డాక్టర్లు, మరో నలుగురు డిప్యూటేషన్‌పై వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో ప్రతిరోజు 6 నుండి 8 కాన్పులు జరిగేవి. వాటిలో ఎక్కువగా నార్మల్ డెలివరీలు ఉండేవి. ప్రస్తుతం నెలకు కేవలం 15 నుండి 20 మాత్రమే కాన్పులు జరుగుతున్నాయి. గైనకాలజీ డాక్టర్లు స్థానికంగా లేక వారానికి ఒకసారి మాత్రమే వచ్చి ఓపి చూడడం వల్ల చాలా మంది గర్భిణీలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఇక ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం కూడా సరిగా లేక రోగులు బయట నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. మూడు సంవత్సరాల క్రితం బ్లడ్ బ్యాంక్ కోసం నిర్మించిన భవనం ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. కేంద్ర నిధులతో నిర్మించిన యోగ షెడ్ కూడా ప్రారంభం కాకుండా అలాగే ఉంది. రోగుల బంధువులు విశ్రాంతి తీసుకునేందుకు షెడ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబర్ 2023లో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ఐదు కోట్ల రూపాయలతో 50 పడకల నూతన భవన నిర్మాణానికి శిలాఫలకం వేశారు. అయితే ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. అనేక గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందించే ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి నూతన భవనం నిర్మించాలని ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.



**పడకేసిన పారిశుధ్యం:**

ఆసుపత్రిలో పారిశుధ్య పరిస్థితులు కూడా అధ్వాన్నంగా ఉన్నాయి. ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లాల్సిన మురుగు నీరు గోడల పరిసరాల్లోనే నిల్వ ఉండిపోవడంతో జనరల్ వార్డు, ప్రసూతి వార్డుల వద్ద దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు, పందులు స్వైర విహారం చేయడంతో రోగులకు కొత్త వ్యాధులు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. పోస్టుమార్టం గది వద్ద మురుగునీరు నిల్వ ఉండడంతో అక్కడ నిలబడలేని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి గోడలపై చెట్లు, గడ్డి పెరిగి అడవిని తలపిస్తున్నా పట్టించుకునే వారు లేరని స్థానికులు అంటున్నారు.



## థిలావస్థలో మరుగుదొడ్లు

ఆసుపత్రిలో ఉన్న మరుగుదొడ్లు కూడా శిథిలావస్థకు చేరాయి. చాలా చోట్ల డోర్లు లేకపోవడం, పెచ్చులూడి ప్రమాదకరంగా మారడం కనిపిస్తోంది. మహిళల వార్డులో ఐదు మరుగుదొడ్లు ఉండగా ప్రస్తుతం రెండు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతావాటికి తాళాలు వేసి ఉన్నాయి. పురుషుల వార్డులో మరుగుదొడ్లు కూడా నిరుపయోగంగా మారాయి. నీటి సరఫరా సరిగా లేక రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 14 మంది స్టాఫ్ నర్సులకు ఒకే కామన్ మరుగుదొడ్డి ఉండటంతో తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది.






# పేద ముస్లింలకు 'రంజాన్ తోఫా' పంపిణీ

**రాజపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** రంజాన్ మాసం పురస్కరించుకొని నమిల గ్రామంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో ఆదివారం ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబ సభ్యులు తమకు తోడ్పాటు అందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకునేందుకు ఈ తోఫా కిట్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిలివేరు బాలరాజ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని సుధాకర్ గౌడ్, సిద్దులు, కొలిపాక యాదగిరి, బత్తిని యాదగిరి, పాండు, లోకేష్, బిక్షపతి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# పవర్ లూమ్ కార్మికులను ఆదుకోవాలి

**- భువనగిరి ఎంపీ చామలకు పద్మశాలి నాయకుల విన్నపం**

**రాజపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** నేత కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని రఘునాథపురం పద్మశాలి నాయకులు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని కోరారు. ఆదివారం ఎంపీని కలిసిన నాయకులు, చేనేత మరియు పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గాడిపెల్లి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. గత మే నెలతో ముగిసిన త్రిఫ్ట్ పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తున్న మాదిరిగానే, పవర్ లూమ్ కార్మికులు 8 శాతం డిపాజిట్ చేస్తే ప్రభుత్వం 16 శాతం వాటా జమ చేసేలా చూడాలన్నారు. పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో అమలవుతున్నట్లుగా తెలంగాణలో కూడా పవర్ లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్ అందించాలని విన్నవించారు.



స్పందించిన ఎంపీ.. ఈ విషయమై సంబంధిత మంత్రి మరియు అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రఘునాథపురం మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్ నేత, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బింగి రమేష్ నేత, సామల భాస్కర్ నేత, కటకం పాండు నేత, ఆడపు భాస్కర్ నేత, కటకం హరినాథ్ నేత, భోగ పాండు నేత, భోగ సిద్ధులు నేత, బల్ల హరీష్ నేత తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సీలో 'ఆర్వో ప్లాంట్'కు మరమ్మతులు

- కలెక్టర్ ఆదేశాలతో పునరుద్ధరించిన తహసీల్దార్



**రాజపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ)లో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్‌కు ఆదివారం మరమ్మతులు పూర్తి చేశారు. ఇటీవల రాజపేట పిహెచ్‌సీని సందర్శించిన జిల్లా కలెక్టర్, తాగునీటి సౌకర్యంపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గమనించి, తక్షణమే దానికి రిపేర్లు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ వల్లపు ప్రదీప్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆదివారం టెక్నీషియన్లను పిలిపించి ప్లాంట్ లోని సాంకేతిక లోపాలను సరిచేయించారు. ప్రస్తుతం ప్లాంట్ అందుబాటులోకి రావడంతో రోగులకు, సిబ్బందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను త్వరితగతిన అమలు చేసిన అధికారుల తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సింగారం సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు గ్రామస్తుల విన్నపం





**రాజపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** మండలంలోని సింగారం గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ కొండ ప్రమీల పండరి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ, కల్వర్టులు, సీసీ రోడ్ల నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించాలని కోరారు. రాజపేట నుంచి సింగారం వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైందని, దానికి మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. అలాగే నూతన పంచాయతీ భవనం, మహిళా భవనం, పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. లావుని పట్టా భూములను సాధారణ పట్టాలుగా మార్చాలని, రెడ్డి చెరువు కాలువ ద్వారా నీటిని మళ్లించి సాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరారు. రవాణా సౌకర్యంపై స్పందిస్తూ.. యాదగిరిగుట్ట డిపో నుంచి రాజపేట మీదుగా మధ్యాహ్నం వేళ బస్సు నడపాలని, గజ్వేల్, జగదేవ్‌పూర్ వరకు సర్వీసులు పొడిగించాలని డిపో మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, బాల నర్సయ్య, కనకయ్య, మహేష్, ప్రభాకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 'జనాభా గణన' దేశాభివృద్ధికి దిక్సూచి

- అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- డిజిటల్ విధానంలో సర్వే.. కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మార్చి 15 (తొలివెలుగు న్యూస్) :** దేశాభివృద్ధికి కీలకమైన జనాభా గణన-2027 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1872లో ప్రారంభమైన జనాభా గణన చరిత్రను గుర్తు చేస్తూ, ఈసారి తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో గణన చేపడుతున్నట్లు వెల్లడించారు. మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌ల ద్వారా ప్రక్రియ సాగుతుందని, ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కూడా ఉంటుందన్నారు. మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) ప్రక్రియ ఉంటుందని, రెండో దశలో ఫిబ్రవరి 2027లో జనాభా గణన నిర్వహిస్తామని వివరించారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి గృహ వసతులు, ఇతర వివరాలకు సంబంధించి 34 ప్రశ్నలకు సమాధానాలు సేకరిస్తారని తెలిపారు. శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి, జిల్లా సెన్సస్ అధికారి వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.




## యాదగిరిగుట్టలో నేత్రపర్వంగా 'లక్ష పుష్పార్చన'





- స్వామి, అమ్మవార్లకు పుష్పాభిషేకం
- పాల్గొన్న దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం లక్ష పుష్పార్చన వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవార్లకు చంపక, మల్లిక, గులాబీ, మందారం వంటి వివిధ రకాల సుగంధ పుష్పాలతో అర్చకులు అర్చన గావించారు. అంతకుముందు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామ పఠనంతో పుష్పవృష్టి కురిపించారు. సాయంత్రం వేళ మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి తిరువీధి సేవ కన్నుల పండువగా సాగింది. అర్చకులు పంచసూక్తలు, దశ శాంతులు పఠిస్తూ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఈఓ భవాని శంకర్, ఏఈఓ రఘు, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో వైభవంగా 'నగర సంకీర్తన'





- మారుమోగిన రామనామ జపం
- పాల్గొన్న జై శ్రీమన్నారాయణ భక్త బృందం

**రాజపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మర్కూక్ శ్రీ భావానంద స్వామివారి ఆశీస్సులతో, అదరాసుపల్లి శ్రీధర శర్మ పర్యవేక్షణలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో దీపారాధన అనంతరం ప్రారంభమైన సంకీర్తన.. పురవీధుల గుండా సాగింది. సార్ధ త్రి శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగంగా భక్తులు భజనలు చేస్తూ, ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ పర్యవేక్షణలో భావానంద అష్టకాన్ని సామూహికంగా పఠించారు. కార్యక్రమంలో నాళ్ల పద్మ, రేపాక భాగ్యలక్ష్మి, చామకూర అరుణ, పెంట రజిత, బిర్రు భాగ్యలక్ష్మి, ఉప్పల శ్రీనివాసులు, కోనూరు బిక్షపతి, నాళ్ల శేఖర్, నంగునూరి రాజు, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు. సార్ధ త్రి శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు.





## 17న స్పోర్ట్స్ స్కూల్ మండల స్థాయి ఎంపికలు

- ఉదయం 8 గంటల నుంచి పోటీలు
- ఎంఈఓ చందా రమేష్ వెల్లడి

**రాజపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దూది వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించిన విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయిలో బాలురకు 100, బాలికలకు 100 సీట్లు అందుబాటులో ఉంటాయని, మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి పంపిస్తామని వివరించారు. 800 మీటర్ల పరుగు, షటిల్ రన్, బ్రాడ్ జంప్ వంటి పలు రకాల శారీరక సామర్థ్య పరీక్షల (బ్యాటరీ టెస్టులు) ద్వారా ఎంపికలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల వారు పీడీ పి.మధు (9848584735)ను సంప్రదించాలని కోరారు.

## రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకలుగా మార్చాలి

- సిపిఎం నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలి : జల్లెల పెంటయ్య



**రామన్నపేట, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నుండి నిర్వహించనున్న నిరవధిక నిరాహార దీక్షలను మండల పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిరవధిక నిరాహార దీక్షల సందర్భంగా ఏర్పాటు చేసే దీక్షా శిబిరం స్థలాన్ని ఆయన సోమవారం మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిసర ప్రాంత ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సేవలు అందించిన ప్రభుత్వాసుపత్రి ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేక దుర్భర పరిస్థితిలో ఉందని అన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని విమర్శించారు. వైద్యసేవలు సక్రమంగా అందక అనేకమంది ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి వస్తోందని, దీంతో ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందక ప్రాణనష్టం కూడా జరుగుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల రాబోయే బడ్జెట్ సమావేశాల్లో రామన్నపేట ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించి, నూతన భవనం నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే నిరవధిక నిరాహార దీక్షల్లో అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నరసింహచారి, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, గొరిగె సోములు, గాదె నరేందర్, నాగటి ఉపేందర్, వేముల సైదులు, మునికుంట్ల లెనిన్, శానగొండ రాము, కూనూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేతో శారీరక, మానసిక ధైర్యం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్
- ఘనంగా కరాటే బెల్ట్ కండక్టింగ్ పరీక్షలు

**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా విద్యార్థులకు ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమని చౌటుప్పల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టైగర్ కుంగ్ - ఫూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ కండక్టింగ్ పరీక్షలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కరాటే వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగుదాల రమేష్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## లారీని ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకుల మృతి

- వలిగొండ మండలం అరూరు శివారులో ప్రమాదం
- మృతుల్లో ఒకరు పశ్చిమ బెంగాల్‌వాసిగా గుర్తింపు



**వలిగొండ, మార్చి 15 (తొలివెలుగు న్యూస్) :** మండలంలోని అరూరు గ్రామ శివారు తొర్రూరు రహదారిపై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీని, ఎదురుగా వస్తున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి జేబులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ఒకరిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంకుర జిల్లా బంగ్లా హిందూపూర్‌కు చెందిన అనురాగ్ రాయ్ (28)గా గుర్తించారు. మరో యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ యుగేందర్ గౌడ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల సెల్‌ఫోన్ల ఆధారంగా వారి పూర్తి వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.



# కాలుష్యం కోరల్లో గ్రామాలు.. ఎంపీకి రైతుల గోడు

- పంటలు పండడం లేదు.. రోగాల బారిన పడుతున్నాం
- కాలుష్యంతో పంటలు, నీరు, ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆవేదన
- ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి రైతుల విన్నపం

**చౌటుప్పల్ / భూదాన్ పోచంపల్లి, మార్చి 15 (తొలివెలుగు న్యూస్) :** పోచంపల్లి మండలం అంతమ్మగూడెం పరిసరాల్లోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల కాలుష్యం కారణంగా సాగు భూములు నిస్సారమవుతున్నాయని, భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కాలుష్య ప్రభావంతో స్థానికులు శ్వాసకోశ, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల విన్నపంపై ఎంపీ తక్షణమే స్పందించారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) మెంబర్ సెక్రటరీ, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి, నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ కోఆర్డినేటర్ చేగూరి ప్రభాకర్, రైతులు దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సంఘాల రుణాలను మాఫీ చేయాలి

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతి
- సహకార సంఘాలను బలోపేతం చేయాలని కోరిన ప్రతినిధులు

**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు వాటిపై ఉన్న రుణాలను తక్షణమే మాఫీ చేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా చేనేత ప్రతినిధులు కోరారు. ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎంపీ నివాసంలో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ. 35 కోట్ల మేర ఉన్న చేనేత సంఘాల బకాయిలను మాఫీ చేసి వాటిని ఆదుకోవాలని విన్నవించారు. గత ప్రభుత్వాల హయాంలో చేనేత రంగం నిర్వీర్యమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాత బకాయిల నుంచి విముక్తి కల్పించి సంఘాలకు నూతన ఉత్తేజం తీసుకురావాలని కోరారు. రుణమాఫీ అనంతరం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్య పద్ధతిలో పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, సహకార సంఘాల గౌరవ అధ్యక్షులు భారత వాసుదేవ్, సహకార సంఘాల యూనియన్ అధ్యక్షులు అప్పం రామేశ్వరం, గుండాల సంఘం అధ్యక్షులు దుదుక ఉప్పలయ్య, కోయలగూడెం సహకార సంఘం అధ్యక్షులు గడ్డం జయశంకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రతినిధులు సూరేపెల్లి శ్రీనివాస్, సీత చక్రపాణి, జిల్లా లక్ష్మీనారాయణ, ఏల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి





- నూతన పెట్రోల్ బంకును ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్) :** వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే ఏ వ్యాపారమైనా విజయవంతమవుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం శివారులో మంగళవారం శ్రీనివాస్ రెడ్డి తన మిత్రులతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్ పీ పెట్రోల్ బంకును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన సొంత కారులో రూ. 2 వేల పెట్రోల్ పోయించుకుని బోణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్తీ లేని ఇంధనం, సరైన కొలతలతో వినియోగదారుల ప్రశంసలు అందుకునేలా బంకును నిర్వహించాలని యాజమాన్యానికి సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. అంతకుముందు బంకు యాజమాన్యం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ, కౌన్సిలర్లు కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బద్రి గాలయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహాగౌడ్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, తాజా మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామమే లక్ష్యం: సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య

- చిన్నకొండూరులో సీసీ రోడ్డు పనులు షురూ
- రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
- గ్రామ అభివృద్ధే ధ్యేయమని వెల్లడి

**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య తెలిపారు. గ్రామంలోని ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. గ్రామాన్ని అంచెలంచెలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామానికి నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సత్తయ్య, వార్డు సభ్యులు తీగుళ్ల శ్రీనివాస్, మేకల ముత్తమ్మ, సిలువేరు పుష్పలత, ఎరుకల కల్పన, చెక్క శివ, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బక్క శ్రీనాథ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్క కిషన్, మాజీ సర్పంచ్‌లు పెంటయ్య, వెంకట్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దోర్నాల సోమలింగం, బక్క మల్లయ్య, బక్క నరసింహ, తీగల లక్ష్మయ్య, చెక్క లింగస్వామి, చెక్క రాజు, మల్లేష్, గోపాల్, శంకరయ్య, నూనె శీను, నర్సింహ, పంచాయతీ కార్యదర్శి సురేష్, కారోబార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

- ఘనంగా కాన్సీరాం జయంతి వేడుకలు
- బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ్ కృష్ణ

**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్) :** బహుజనులకు రాజ్యాధికారం కేవలం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)తోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ్ కృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కొయ్యలగూడెంలోని శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మాన్యవర్ కాన్సీరాం 92వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు చౌటుప్పల్ కేంద్రంలో జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కాన్సీరాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థులు బరిలోకి దిగుతారని వెల్లడించారు. బీసీలకు 60 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీయేనని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్, మంచాల శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, పార్లమెంట్ ఇంచార్జీలు దయాకరణ్ మౌర్య, కాన్షీరాం, స్టాలిన్, యాదగిరి, వాసుదేవ్, జిల్లా అధ్యక్షుడు లింగస్వామి, రాంబాబు, నియోజకవర్గ ఇంచార్జి దానంజన్ తదితరులు పాల్గొన్నారు.





# నృత్య నీరాజనం.. భక్తుల పరవశం!

- శేరీలలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం
- కుచిపూడి నృత్యాలతో ఆకట్టుకున్న చిన్నారులు
- వారాహి డ్యాన్స్ స్టూడియో విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు
- చిన్నారుల ప్రతిభకు ఆలయ కమిటీ బహుమతులు
- కళా ప్రదర్శనలకు ముగ్ధులైన గ్రామస్తులు
- భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఆలయోత్సవం

**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** మండలంలోని శేరీల గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునఃప్రారంభోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారాహి డ్యాన్స్ స్టూడియో విద్యార్థులు ప్రదర్శించిన కుచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టూడియో ప్రొప్రైటర్లు ఎడ్ల హిమబిందు రెడ్డి, సామినేని దీపికల పర్యవేక్షణలో చిన్నారులు అందమైన అభినయంతో నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు ఆలయ కమిటీ తరఫున బహుమతులు అందజేశారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు ఎడ్ల మహేందర్ రెడ్డి, ఎడ్ల అంజి రెడ్డిలు కన్సోలేషన్ ప్రైజ్ మనీని అందించారు. చిన్నారులు ఎడ్ల అక్షయ రెడ్డి, కీర్తనల పేరుతో ఈ నగదు బహుమతులను స్పాన్సర్ చేశారు. భక్తి, సాంస్కృతిక వేడుకల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.





# ప్రజలకు అందుబాటులో వార్డు కార్యాలయం

- ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా: కౌన్సిలర్ కాసర్ల మంజుల



**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 7వ వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డులోని వృద్ధులు పింఛన్ల కోసం, కాలనీ వాసులు తమ సమస్యలను విన్నవించుకోవడానికి ఇకపై ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్మిళ్ల ఫ్లైఓవర్‌బెల్లంపల్లి చౌరస్తా రోడ్డు వైడెనింగ్ పనులు వేగవంతం

**మంచిర్యాల, 15, మార్చి (తొలివెలుగు న్యూస్):** మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ల ఫ్లైఓవర్ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు చేపట్టిన రోడ్డు వెడల్పు పనులు చకచకా కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం ప్రారంభమైన పనులు రాత్రి వేళల్లో కూడా కొనసాగగా, ఆదివారం రోజున కూడా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో దుకాణాలు అధికంగా ఉండటంతో పనుల వేగంలో కొంత ఆలస్యం చోటు చేసుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది బుల్డోజర్ల సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని, అక్కడి నాళాలను తొలగిస్తూ పనులను కొనసాగిస్తున్నారు. పనుల సందర్భంగా గోదావరి నీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్ దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. పండుగ సమయం కావడంతో తాగునీటి సరఫరా అంతరాయం కలగకుండా వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి నీటి సరఫరాను కొనసాగించాలని స్థానిక ప్రజలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు. దాదాపు కిలోమీటర్ మేర రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. కార్లు, ద్విచక్ర వాహనాలు లోనికి రాకుండా రాళ్లను అడ్డుగా ఉంచి భద్రతా చర్యలు తీసుకుంటూ పనులను కొనసాగిస్తున్నారు. రోడ్డు వైడెనింగ్ పనులను త్వరగా పూర్తిచేసి తమ వ్యాపార కార్యకలాపాలు అంతరాయం కలగకుండా చూడాలని స్థానిక వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

**మంచిర్యాల, 15, మార్చి (తొలివెలుగు న్యూస్):** మంచిర్యాల నగరంలోని గుడిపేట మెడికల్ కాలేజ్ బస్ స్టాప్ ఆవరణలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో కారు తీవ్రంగా దెబ్బతింది.అయితే అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికి ప్రాణహాని జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ డిపో1కు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులను బస్ స్టాప్ వద్ద దించేందుకు ఆగింది.ఆ సమయంలో బస్సులో దాదాపు 42 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం.బస్ స్టాప్ కావడంతో కొంతమంది ప్రయాణికులు దిగుతున్న సమయంలోనే వెనుక వైపు నుంచి వస్తున్న కారు బస్సును ఢీకొట్టింది.కారు డ్రైవర్ కొంత ఏమరపాటుతో ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.బస్సు ఆగి ఉన్న సమయంలోనే కారు వెనుక భాగంలో బలంగా ఢీకొట్టడంతో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతిని నుజ్జునుజ్జయింది.ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులు,బస్సు డ్రైవర్, అలాగే కారులో ప్రయాణిస్తున్న వారు అందరూ సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు తెలిపారు.ఎవరికీ గాయాలు కాకపోవడం వల్ల అక్కడ ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు.అయితే కారు కొంతమేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు మరియు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.కొంతసేపు అక్కడ ట్రాఫిక్ అంతరాయం కలిగినా తర్వాత పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బస్ స్టాప్ ప్రాంతాల్లో వేగాన్ని నియంత్రించుకోవాలని పోలీసులు సూచించారు.



# గోవింద నామస్మరణతో పులకించిన చౌటుప్పల్

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- అన్నదానం, రథోత్సవంతో భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఉత్సవాలు





**చౌటుప్పల్, మార్చి 15 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో గల శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 8 గంటలకు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించగా, 11.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహించగా, రాత్రి 8 గంటలకు మంత్రపుష్పంతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు నాగిళ్ల రామచంద్రం, ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్, కోశాధికారి ఎలక రాజునాగరాజు (మల్లేష్), సహాయ కార్యదర్శి ఉష్కాగుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి తూర్పునూరి నరసింహ గౌడ్, ఆరుట్ల లింగస్వామి, సంస్కృతిక కార్యదర్శులు తూర్పునూరి మల్లేష్ గౌడ్, గట్టు పవన్, కార్యవర్గ సభ్యులు నకిరేకంటి శ్రీశైలం, ఊదరి మారయ్య, ఊదరి యాదయ్య, చెవగొని మహేష్, జక్కర్తి శేఖర్, నల్ల పర్వతాలు, ఉయ్యాల పల్లవి, గంగిరెడ్డి నాగలక్ష్మి, గౌరవ సలహాదారులు చింతల దామోదర్ రెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, మంచికంటి భాస్కర్ గుప్తా, గుజ్జల సురేందర్ రెడ్డి, అన్నెమోని గోవిందరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు బత్తుల విప్లవ గౌడ్, కాసుల వెంకటేష్, బాల్యం వెంకటాచలపతి, నల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.







# ఖానాపూర్ మున్సిపాలిటీ కొలువు తీరదా?

**ఖానాపూర్ (తొలివెలుగు న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగానిర్మల్ జిల్లా ఖానాపూర్ లో సైతం మున్సిపల్ కౌన్సిలర్లకు ఎన్నికలు జరిగి నెల రోజులు గడుస్తున్న మున్సిపాలిటీ పాలకవర్గం ఇంకా కొలువు తీరలేదు పట్టణ ప్రజలు ఇచ్చిన తీర్పు ఎ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ కు చేరుకోకపోగా బిజెపి బి ఆర్ఎస్ అధికార కాంగ్రెస్ పార్టీలు ఆందోళనలో పడిపోయారు అయితే గత నెల 16న నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం తో పాటు మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపిక కావాల్సి ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఒక స్వతంత్ర కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఎమ్మెల్యేతో సహా ఐదుగురు హాజరయ్యారు అయితే మ్యాజిక్ ఫిగర్ లేకపోగా క్యాంపుకు వెళ్లిన బిజెపి టిఆర్ఎస్ కౌన్సిలర్లకు సయోధ్య కుదరక 16న ప్రమాణ స్వీకారం కానికి ఎంపికకు హాజరు కాలేకపోయారు తిరిగి మరో రోజు ఫిబ్రవరి 17న జిల్లా కలెక్టర్ గడువు విధించింది తిరిగి రెండో రోజు సైతం బి ఆర్ఎస్ బిజెపికి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు తలా నలుగురు చొప్పున రాకపోవడంతో తిరిగి వాయిదా వేసినట్లు ప్రకటించిన రెండు సార్లు వాయిదా పడ్డ దరిమిలా జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారులకు అధికారం కాకుండా రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకే గడువు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికీ ఆ గడువు ఇవ్వకపోవడంతో నెల రోజులు నేటికీ గడిచిపోయింది 12 మంది కౌన్సిలర్లు ఉన్న పట్టణంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో నలుగురు కాంగ్రెస్ నలుగురు బిజెపి నలుగురు టిఆర్ఎస్ కావడం ఇప్పటికి మూడు పార్టీల్లో ఏ రెండు పార్టీలకు సయోధ్య కుదరక చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపిక కొలిక్కి రాక ప్రమాణ స్వీకారం చేయకుండా ప్రజల్లో తిరగకుండా నెలరోజుపాటు కనుమరుగైన కౌన్సిలర్లను ఖానాపూర్ పట్టణ ప్రజలు విసుక్కుంటున్నారు బిజెపి బిఆర్ఎస్ కలిస్తే పీఠం అధికార పార్టీ చేతికంద కుండా అడ్డుకునే అవకాశం ఉంది అయితే వీరి కలయిక జరగడం కష్టమని తిరిగి అధికార పార్టీకి చెందిన వాళ్లే చైర్మన్ వైస్ చైర్మన్గా ఎంపిక అవుతారని పట్టణంలో పుకార్లు చెలరేగుతున్నాయి బి ఆర్ఎస్ కౌన్సిలర్ నలుగురు ఇప్పటికీ పట్టణం చేరుకోకపోగా నిన్న టి రోజు బిజెపి కౌన్సిలర్లు పట్టణానికి చేరుకున్నారన్న వార్త తెలిసింది బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు రితీష్ రాథోడ్ సైతం ఈ మేరకు ఎలాంటి సమాచారాన్ని అందించకపోవడం బి ఆర్ఎస్ అసెంబ్లీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ప్రజలు ఇచ్చిన తీర్పునే శిరసావిస్తూ ప్రతిపక్షంలో లైన పోరాడి ప్రజా సమస్యలు తీరుస్తామంటున్నట్లు తెలిసింది బిజెపి బీఆర్ఎస్ల పొత్తు కుదరకపోతేనే అధికార కాంగ్రెస్ పార్టీకి కలిసి రావడానికి ఎమ్మెల్యేబొజ్జు పటేల్ ఎక్స్ అఫీషియో ఓటు కీలకంతో మొత్తం ఐదుగురు సభ్యులు ఎంపిక జరిగి చైర్మన్ వైస్ చైర్మన్ పార్టీ ఎంపిక జరిగి అధికార కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠంపై కూర్చుంటుందన్న ధీమా కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ పట్టణ ప్రముఖులు వ్యాఖ్యానిస్తున్నారు స్థానిక ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొజ్జు పటేల్ సైతం తమ పాలకవర్గమే ఉంటుందన్న ధీమాలో ఉండడం కౌసర్ల కోసం ప్రయత్నించడం బెరసారాలు జరపకపోవడం కనిపించకపోవడంతో పటిష్టమైన నమ్మకంతో ఉన్నట్లు తెలుస్తోంది రాష్ట్ర ఎన్నికల కమిషన్ తేదీ ఇస్తే గాని 8 మంది బిజెపి టీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేసి ఎన్నిక జరుపుతే గాని ఎవరు చైర్మన్ వైస్ చైర్మన్ అవుతారు అన్నది వేచి చూడాల్సిందేనని పరిశీలకులు భావిస్తున్నారు